కథ

# హి మ బిం దు

- వలివేటి నాగచంద్రావతి

తడిబట్టలు దులిపి దండెం మీద ఆరేస్తూ కీచుకీచుమనే శబ్దం విలక్షణంగా వినిపించేసరికి అటుకేసి చూసింది సంధ్య.

బాదంచెట్టు కొమ్మల్లో కాకిగూడు. నిన్నటి వరకూ నిశ్శబ్దంగా ఉన్న ఆ గూట్లోంచి ముణ్ణాలుగు బుజ్జిబుజ్జి కాకిపిల్లలు ఎర్రెర్రటి నోళ్ళు పైకెత్తి గోలగా అరుస్తున్నాయ్. నోటితో తెచ్చిన ఆహారాన్ని నోటితోనే ఆ బుజ్జి నోళ్ళకందిస్తోంది తల్లికాకి.

'ఎంత ఇంపైన దృశ్యమది' వికసించ బోతున్న సంధ్య వదనం అంతలోనే ముడుచుకుపోయింది. 'పక్షికీ పశువుకీ కూడా సహజంగా అబ్బే ఆ అదృష్టం నుంచి తను బహిష్కరింపబడింది' అప్రయత్నంగా హృదయంతోపాటు కళ్ళు కూడా తడి అయ్యాయి సంధ్యకి. పది సంవత్సరాలయింది తన పెళ్ళయి. రెండేళ్ళలో రెండుసార్లు అబార్షన్‌లు. మూడోసారి ఇన్‌ఫెక్షన్ సోకి గర్భసంచి తొలగించేశారు. భవిష్యత్తులోనన్నా బిడ్డల్నెత్తుకుంటుందన్న ఆశ అంతరించిపోయింది. తను గొడ్రాలని నిర్ధారణ అయిపోయింది.

"సంధ్యా" వంటింట్లోంచి అత్తగారి పిలుపు.

"అయిపోయిందత్తమ్మా వస్తున్నాను" రుద్ధమయిన కంఠాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంది సంధ్య.

అత్తగారు శాంతమ్మ నిజంగా శాంతమూర్తి. ఎవరినీ నొప్పించే స్వభావం కాదు. ఒక్కసారీ తనకు బిడ్డలు కలగరన్న సంగతి గుర్తుచేసి బాధ పెట్టదు.

కానీ తనకు తెలుసు. దోగాడే ఏ పసిబిడ్డని చూసినా ఆమె కళ్ళు మెరుస్తయ్. ఏ అమ్మో గుమ్మంలోకొచ్చి బొట్టుపెట్టి... మా అమ్మాయికీవేళ సీమంతమంటుంది. ఏ కోడలో పళ్ళెంలో చలిమిడీ, చెక్కబొమ్మా తెచ్చిచ్చి... బిడ్డసారె తెచ్చుకున్నానంటుంది. ఆ క్షణాన అత్తగారి మొహాన చిరునవ్వుంటుంది. కానీ కళ్ళల్లో దిగులుంటుంది. దాని అర్థం- మనకూ ఓ బిడ్డ... అని కాదూ!

నిట్టూరుస్తూ పెరట్లోంచీ వంటింట్లోకి వచ్చింది సంధ్య.

"అబ్బాయి ఈ పూట భోజనానికి రాడుగా?" అడిగింది శాంతమ్మ.

"లేదత్తమ్మా, ఆయనొస్తున్న ట్రైను ఇక్కడికొచ్చేసరికి రాత్రి పదవుతుంది" అంది సంధ్య కూరల ట్రే ముందుపెట్టుకుంటూ.

రాత్రి పదిన్నరయింది - సంధ్య భర్త ఆదిత్య ఊర్నించొచ్చేటప్పటికి. వీధి తలుపు తీస్తూనే "వచ్చారా, అరగంట లేటు కదూ... తోవలో ఏమన్నా తిన్నారా లేదా" పరామర్శిస్తున్నదల్లా టక్కున ఆపింది సంధ్య.

ఆదిత్య చేయి పట్టుకుని సగం అతని కాళ్ళ వెనక దాక్కుంటున్న ఆ రెండడుగుల శాల్తీ- ఎవరు?

ఎర్రటి పువ్వులున్న తెల్లటి గౌను... సగమే అవుపడుతోన్న మొహంలో పండీపండని టొమాటో రంగు బుగ్గ... ఓ చేతిలో బన్నీబొమ్మా... నల్లని కళ్ళలో నిద్రమత్తుతోపాటు బెరుకూ, భయం... బొద్దుగా ముద్దుగా... ఎవరీ చిట్టితల్లి?


సంధ్య మొహంలో ప్రశ్నార్థకం చూసి "మన పాపే" అన్నాడాదిత్య చిరునవ్వుతో లోపలికొస్తూ.

అర్థంకాకపోయినా అతను పాపని 'మన' అనటం చాలా హాయిగా అనిపించింది సంధ్యకి. ఆదిత్యని ఆనుకునే లోపలికొచ్చిన పాపని దగ్గరకు తీసుకోబోయిందిగానీ ఆ పిల్ల ఏడుపు మొహం పెట్టడం చూసి ఆగిపోయింది.

ఎంతో కష్టం మీద ఒక గ్లాసు పాలు మాత్రం బలవంతాన తాగించి బన్నీతోపాటు పాపని పడుకోబెట్టాడు ఆదిత్యే.

అలికిడికి లేచివచ్చిన శాంతమ్మతో "రాఘవ కూతురు హిమబిందు అమ్మా" చెప్పాడు ఆదిత్య.

అర్థమయింది శాంతమ్మకి.



* * *

రాఘవ, ఆదిత్య సహోద్యోగులే కాదు - మనసులు విప్పి కష్టసుఖాలు చెప్పుకోగల మంచి స్నేహితులు కూడా. నాలుగేళ్ళక్రితమే ప్రమోషన్ మీద ఈ ఊరొచ్చేశాడు ఆదిత్య. సెక్షన్‌లు మాత్రం మారుతూ రాఘవ హెడ్డాఫీసులోనే ఉండిపోయాడు. మనుషులు దూరమైనా వారి చెలిమి మాత్రం చెడలేదు. తరచూ రాఘవ ఆదిత్యకి ఫోన్ చేస్తూనే ఉంటాడు. పనిమీద హెడ్డాఫీసుకి వెళ్ళినప్పుడల్లా రాఘవని కలవకుండా రాడు ఆదిత్య.

వివాహం ఆలస్యమైనా ముందు తండ్రయినవాడు రాఘవే. మొదటిసారి పుట్టిన కవలలిద్దరూ ఆడపిల్లలే అయినందుకు తల్లి గుణిస్తోందని మిత్రుడితో బాధపడుతూ చెప్పేవాడు రాఘవ. వినీవినీ 'పోనీ నీకెక్కువైన పాపని నాకిచ్చెయ్' అనేవాడు ఆదిత్య- స్నేహితుడి విచారాన్ని తేలిక చేసేందుకు. నవ్వేసేవాడు రాఘవ. కానీ ఇప్పుడదే నిజమయింది.

రెండు రోజులక్రితం రాఘవ ఫోన్ చేశాడు 'పాపనిమ్మని అడిగావోసారి. మనస్ఫూర్తిగా ఆ మాటన్నట్టయితే రా, పాపని తీసుకువెళ్ళు' అని.

ఆఫీసు పనుందని ఇంట్లో చెప్పి అయోమయంగానే వెళ్ళాడాదిత్య.

వారసుడు ఉండాల్సిందే అన్న తల్లి కోరిక మేరకు రెండోసారి ప్రసవించింది రాఘవ భార్య. దురదృష్టం... ఈసారీ ఆడపిల్లే. "అమ్మ సతాయింపు భరించలేకుండా ఉన్నాంరా" అన్నాడు రాఘవ. నిజానికి అతనికీ కష్టంగానే ఉన్నదని బిగదీసుకున్న అతని మొహం చూడగానే తెలుస్తోంది.

పాపని తీసుకువెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు ఆదిత్య. సంధ్యా, శాంతమ్మా కూడా ఇందుకు సంతోషిస్తారని అతనికి తెలుసు. అంచేత ముందస్తుగా వాళ్ళ అంగీకారం కోసం ఆగలేదు.

నెలన్నా వెళ్ళని చంటిపిల్ల... చాలా అర్భనాకారంగా ఉంది. అప్పుడే తల్లిపాలు మాన్పించటం మంచిది కాదన్నాడు డాక్టరు. పెద్ద పిల్లలిద్దరిలోనూ పెద్దమ్మాయికి తల్లి

పేరు పెట్టుకున్నారట. అంచేత చిన్నమ్మాయి హిమబిందుని తీసుకువచ్చేశాడు ఆదిత్య. అదీ సంగతి.

★ ★ ★

పొద్దున లేవగానే చుట్టూరా ఓసారి చూసుకుని "అమ్మా" అంటూ ఏడవటం మొదలుపెట్టింది బిందు. ఓదారుద్దామంటే సంధ్యనిగానీ శాంతమ్మనిగానీ దగ్గరకన్నా రానివ్వలేదు. స్వరం పెంచేసింది.

ఆదిత్య లేచొచ్చి "నువ్వు ఏడుపు మానేసి ఎంచక్కా తయారయిపోతే వెంటనే అమ్మ దగ్గరకెళ్ళిపోదాం, సరేనా" అని హామీ ఇచ్చి సముదాయించాక కొద్దిగా శాంతించింది. ఇక ఆ తరవాత ఆతన్ని క్షణం వదలలేదు. కనుమరుగన్నా కానివ్వలేదు. పోనీ అంటే ఎత్తుకునే ఉన్నా పది నిమిషాలకోకసారి 'అమ్మా' అని గుర్తుచేసి గుణుస్తూనే ఉంది. ఆదిత్యే ఎలాగో తంటాలుపడి ఆ పిల్ల స్నానం పానం అవజేశాడు.

అతను బిందుకు స్నానం చేయించేటప్పుడూ, పంచదార అద్ది ఇడ్లీ నోట్లో పెడుతున్నప్పుడూ ఆ పాపని తాకాలనీ ఆ పనులు తన చేతుల్తో చేయాలనీ తెగ ఆరాటపడింది పాపం సంధ్య. ఏదీ - ఒక్కడుగు ముందుకు వేయనిస్తేనా - "ఉహూం- నువ్వొద్దు" అనేసింది బిందు, బిక్కమొహం పెట్టి తన నిరసన తెలిసేలా తలా, చెయ్యా అడ్డంగా ఊపేస్తూ.

ఉండేలు దెబ్బతిన్న పావురాయిలా విలవిల్లాడే సంధ్యని జాలిగా చూసింది శాంతమ్మ. "కొత్తగదూ, రెండ్రోజులుపోతే తనే దగ్గరకొస్తుంది" అంది అనునయిస్తూ.

అదే ఆశించారు సంధ్యా, ఆదిత్యా. కానీ, రోజులు కాదు గంటలు గడిచేకొద్దీనే ఆ ఆశ తరుగటం ఆరంభించింది.

భుజాన ఉన్న బిందుని బలవంతాన గుమ్మం దగ్గర దింపి "ఆటో తెస్తానూ..." అని చెప్పి ఎలాగో ఆఫీసుకు వెళ్ళిపోయాడాదిత్య.

మరంతే. నుంచున్న చోటునుంచి కదల్లేదు బిందు. శాంతమ్మ లోపలికి రమ్మని ఎంతో బతిమలాడింది. బంగపడింది. ఉహూ- ఉలకలేదు, పలకలేదు పాప. పరాయివాళ్ళని చూసినట్టు ఏ భావమూ లేకుండా చూసిందంతే.

సంధ్యని అయితే మరీ దారుణం. కనిపించటం ఆలస్యం "నువ్వొద్దు, నువ్వొద్దు" అని ఏడుపు. హతాశురాలయింది సంధ్య. పాప అలా అన్నప్పుడల్లా గుండె మెలిపెట్టినట్టు కుంగిపోతోంది ఆమె.

పాప గంటసేపలా నుంచొనీ నుంచొనీ అమైన మగతగా కిందికి జారి అలాగే నిద్రపోయింది. పాప అలాగ ఒట్టి నేలమీద ముడుచుకు పడుకునుంటే కడుపు తరుక్కుపోతోంది సంధ్యకి. కానీ, ఏం చేయటం? మధ్యాహ్నం లంచ్‌కి ఆదిత్య ఇంటికి వచ్చేదాకా పాపని కదిపే సాహసం మాత్రం చేయలేకపోయింది.

మర్నాడు పరిస్థితి ఒక్కరవ్వ మారింది. పాప ఏడుపు తగ్గించింది. ఎక్కడో ఓచోట బన్నీని పొట్టకి అదుముకుని డల్‌గా కూచుండిపోతోంది. కనీసం ఆదిత్య "అమ్మ దగ్గరకెడదాం" అంటున్నా నమ్మకం లేనట్టు చూసి మొహం పక్కకి తిప్పేసుకుంటోంది. ఏ కళనుందో పనిమనిషి మంగ స్నానం చేయిస్తుంటే ఊరుకుంది. ఏమన్నా తినిపించుదామంటే మాత్రం ససేమిరా నోరు తెరవలేదు.

భయపడిపోయారు. ఓ ప్రయత్నంగా తను కనబడకుండా బిందుకు కనబడేలా ఓ పళ్ళెంలో ఇన్ని పళ్ళ ముక్కలూ, బిస్కట్లూ, చాక్లెట్లూ పెట్టేసి ఇవతలకి వచ్చేసింది సంధ్య. బిందుకి ఎప్పుడో ఆకలి వేసి ఉంటుంది బాగా... తినేసింది. అది కూడా ఎవరూ చూడనప్పుడే.

'బతికాం' అనుకున్నారు.

కానీ, ఆ తరవాత షరా మామూలే. బన్నీని ఒళ్ళో ఉంచుకుని సోఫాలో ఓ మూల ఒదిగి ఒదిగి కూర్చోవటం, అక్కడే



సొమ్మసిల్లినట్టు నిద్రపోవటం.

శాంతమ్మ అంది "ఏమో సుమీ, ఈ పిల్ల మనలో ఇమిడేలా లేదు" పెదవి విరుస్తూ అని, చుక్క రక్తం లేనట్టు పాలిపోయిన సంధ్య మొహం చూసి గతుక్కుమంది. తప్పు చేసినట్టు పశ్చాత్తాపపడింది.

ఆ రాత్రంతా సంధ్యకి తెరుపూ మరుపూ నిద్రే. మెలుకువలో పాపని ఎలా మాలిమి చేసుకోవాలా అన్న ఆరాటం. సుఖంలేని నిద్ర. ఆ నిద్రలో కూడా తెలీని దిగులు.

మర్నాడు ఉదయం పని అవుతూనే హడావుడిగా బయటకు వెళ్ళి వచ్చేటప్పుడు చేతులనిండా రకరకాల బొమ్మలూ, సరికొత్త డిజైను డ్రెస్సులూ మోసుకొచ్చింది సంధ్య. అన్నీ పాప ఎదురుగా పేర్చింది.

డ్రమ్ము మోగించీ, కీ ఇచ్చి కారూ రైలూ పరిగెట్టించీ, దొరసాని బొమ్మని ఎగరేసి, నవ్వించీ, గిర్రున బొంగరాలు తిప్పి... బిందు మొహంలో స్నేహం, ఉత్సాహం కోసం ఎంతో ఆశగా ఎదురుచూసింది.

ఆహ్హే... పాపలో స్పందనే లేదు. పైగా 'నన్ను మభ్యపెట్టలేవు సుమీ' అన్న ఒకానొక తిరుగుబాటు చూపు.

అంతకంతకూ మనసును ఆక్రమిస్తున్న నైరాశ్యాన్నీ, నిరుత్సాహాన్నీ యుద్ధం చేసి మరీ దూరానికి తరుముతూ మరో దారికోసం వెతికింది సంధ్య.

గంటలో చుట్టుపక్కల ఇళ్ళలో పిల్లలు పదిమంది బిందు చుట్టూరా ఉన్నారు. వాళ్ళతో ముందే ఒప్పందం- బొమ్మలన్నిటితోనూ ఆడుకోవచ్చు- కానీ బిందుని కూడా తప్పనిసరిగా కలుపుకోవాలి. బిస్కట్లూ, స్వీట్లూ అన్నీ తినేయొచ్చు. పాప కూడా తినేలా చూడాలి. అలా చేయగలిగితే అందరికీ మంచిమంచి గిఫ్టులు.

అరగంటలో పిల్లలంతా పాలోమంటూ వెళ్ళిపోయారు... "మీ పాపతో మేమంతా కటీఫ్ ఆంటీ. మాతో అస్సలు మాట్లాడ్డమే లేదు" అని ఫిర్యాదు చేసి మరీ.

వచ్చి చూసింది. హాల్లో బొమ్మలన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నయ్ - ఒకట్రెండు ముక్కలయి మరీ.

టిఫిన్ ప్లేటు ఖాళీ. బిందు మాత్రం చంకలో బన్నీని ఇరికించుకుని ఏ ప్రలోభాలకీ చలించని విరాగిలా నిర్లిప్తంగా మూతి బిగించుకుని మునగదీసుకుని ఓ మూల కూర్చుని ఉంది.

'అంబులపొదిలో బాణాలన్నీ అయిపోయినయ్. ఇక... ఇక అపజయాన్ని ఒప్పుకునే తీరాలి' నిట్టూర్చింది సంధ్య. బిందుకి దగ్గరగా విసిరేసినట్టున్న బార్బీ బొమ్మని చేతిలోకి తీసుకుంటూ దీనంగా చూసింది బిందు మొహంలోకి 'కరుణించవా' అన్నట్టు.

"వద్దు, నువ్వొద్దు" మెల్లగా బెరుగ్గా గొణుగుతున్నట్టుంటోంది బిందు.

అప్పుడొచ్చింది దుఃఖం సంధ్యకి. "అవును, నీకు నేనొద్దు. నేనిచ్చేవేవీ నీకొద్దు. కానీ నాకు నువ్వు కావాలి, కావాలి" వెక్కివెక్కి ఏడుస్తూ చేతుల్లో మొహం దాచుకుంది సంధ్య.

పరిగెత్తుకొచ్చింది శాంతమ్మ. కోడల్ని ఆ స్థితిలో చూసి ఆమె బేజారయిపోయింది. కూలబడిపోయిన సంధ్యని లేవదీసి దగ్గరగా పొదువుకుంది. "ఏడవకు సంధ్యా" అని కళ్ళు తుడిచింది. బిందుని చూస్తూ "ఇది మన సొత్తుకాదమ్మా. పొరపాటుగా మనలో కలిపేసుకోవాలని మనసుపడ్డాం. నీక్కా నెయ్యా పలచగానే ఉన్నా అవి కలవ్వు సంధ్యా. నువ్వే సంబాళించుకోవాలి" అంది గాద్గదికంగా.

పులుకూ పులుకూ చూస్తోందిదంతా బిందు.

★ ★ ★

మరో రెండ్రోజులు ఎలా గడిచాయోగానీ గడిచాయి. బిందు యథాప్రకారం స్తబ్దుగానో, తాత్కాలికంగా ఉంటున్న జాగాని ఏ క్షణాన్నయినా ఖాళీచేసి వెళ్ళటానికి సిద్ధంగా



ఉన్న కాందిశీకుల్లాగానో ఉంటోంది. సంధ్యేమో ఆ పాప చుట్టూరానే దేబిరిస్తున్నట్టుగా తిరగటం, కన్నెత్తి చూస్తే చాలని పరితపించటం... ఆ పిల్ల అయిష్టంగా చూస్తే డీలాపడిపోవటం.

ఉన్నట్టుండి తనో విషయం గమనించట్లేదని గమనించింది శాంతమ్మ.

వల్లమాలిన దిగులు, విచారం, నిస్సహాయత, నిద్రలేమి, నామమాత్రంగా ఆహారం... సంధ్య చాలా నీరసించిపోయింది. కళ్ళకింద నల్లచారలొచ్చేశాయి. చెంపల్లో నిగారింపు తగ్గిపోయింది. ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే సంధ్య మొహం ఆ మందహాసం మరుగునపడి మబ్బుతెర వేసిన ఆకాశంలా వెలవెలపోతోంది. 'తానింక ఉదాశీనంగా ఉండిపోతే ఆ బిందు మాట అటుంచి, ఈ అమ్మాయేమయిపోతుందో' అన్న బెంగొచ్చేసిందావిడకి.

ఆరోజు సాయంత్రం ఆదిత్య ఆఫీసు నుంచి ఇంటికి రాగానే సంధ్య ఇవ్వాల్సిన 'టీ' తను తీసుకువెళ్ళి అతని చేతికందించింది. పక్కన కూర్చుంది.

భార్య తేవాల్సిన టీ తల్లి తెచ్చిచ్చినప్పుడే అనుకున్నాడాదిత్య- తనకేదో చెప్పదలుచుకున్నదని. "చెప్పమ్మా" అన్నాడు మెత్తగా.

"బిందూని దిగబెట్టేసిరా ఆదీ - ఆ పిల్ల మనకు నప్పదు" అంది ముక్తసరిగా.

అమ్మ ఎందుకలా అన్నదో గ్రహించుకోలేనంత మబ్బుకాదు ఆదిత్య. "అమ్మా, ఇంకో నాలుగురోజులు ఆగితే..." అన్నాడు అర్థోక్తిలో మాటాపి ఆశగా చూస్తూ.

"వద్దురా ఆదీ. వారమవుతోంది... బిందు కొంచెం కూడా మారలేదు. ఇంకో నాలుగురోజుల్లో మనకు అతుక్కుపోతుందన్న నమ్మకం నాకులేదు" అంది విరక్తిగా.

"నిజమే కానీ, నాకు ఇంకొన్నాళ్ళు చూద్దామనిపిస్తోందమ్మా నా మాట విను..." తల్లిని ఒప్పించాలని బతిమలాడుతున్నట్టుగా అన్నాడాదిత్య.

శాంతమ్మలో శాంతం పోయింది.

"చూడు. ఇంకా చూడు. ఆపాటికి నా కోడలు మంచమెక్కుతుంది. సంధ్యని చూస్తున్నావా- పిచ్చిదాన్లా ఎలా తయారయిందో? ఎంతసేపూ 'నువ్వొద్దు, నువ్వొద్దు' అంటున్నా ఆ బిందు మీదే దాని ధ్యాసంతా. ఈ వారంరోజుల్లో సరిగ్గా గుప్పెడు మెతుకులు తినంగా చూళ్ళేదు. ఒక్క పని నిలకడగా చేసింది లేదు. ఎప్పుడూ ఆ పాపముందు దూరంగా తారట్లాడుతూ ఉంటుంది. దగ్గరగా వెళ్ళటానికి భయం - 'నువ్వొద్దు' అంటుందని. పళ్ళెంలో పెట్టింది తినేదాకా ఆందోళనపడిపోతుంది. ఆ పిల్లకి నచ్చేలా ఎలా ఉండాలా అని తెగ మథనపడిపోతుంది. నేను దాని బాధ చూళ్ళేకుండా ఉన్నాన్రా. పిల్లలు పుట్టరన్నప్పుడే నయం, గుండె రాయి చేసుకుంది. ఇప్పుడీ పాపని తీసుకొచ్చి మనమే గాయాన్ని రేపినట్టయింది. ఈ వారంరోజుల్లో ఎన్నిసార్లు కళ్ళు తడిచేసుకుందో. పిచ్చి సన్నాసి. బిడ్డల్ని సాకాలని అది ఎంత పరితపిస్తోందో నాకు తెలుసు. ఏం చేస్తాం... దానికా ప్రాప్తం లేదు. రోజులు గడిచేకొద్దీ ఆ బిందు మాటేమోగానీ ఆ పిల్లమీద మమకారం పెంచేసుకుని సంధ్య మాత్రం పిచ్చిదయిపోతుంది. వద్దు నాయనా వద్దు. బెంగెట్టుకుని ఆ బిందు జబ్బుపడినా ప్రమాదమే, నా కోడలు అడ్డంపడినా ప్రమాదమే. నా మాట విని రేపే వెళ్ళి దిగబెట్టేసిరా." ఎప్పుడోగానీ ఇన్ని మాటలు మాట్లాడదు శాంతమ్మ.

వంటింట్లో పాలు వెచ్చబెడుతూ అన్నీ వింటూనే ఉంది సంధ్య. 'తనదే అనుకుంటున్న ఆ బంగారుతల్లి వెళ్ళిపోతుందా. ఆ పాపకి తనలో అమ్మతనం కనిపించలేదా. పాపల్ని లాలించే అర్హత, హక్కు తనకి లేవా? అందుకే భగవంతుడా వరాన్ని తనకివ్వలేదా? కానీ, పాపల ముద్దు మురిపాలలో తరించిపోవాలనే వ్యామోహాన్నీ, 'అమ్మా' అని పిలిపించుకోవాలనే ఆశనీ ఎందుకు తుడిచెయ్యలేదు మరి.'

ఇంకాసేపటికే వెయ్యి పుట్లుగా జ్వరం ముంచుకొచ్చింది సంధ్యకి. తూలిపోతూ పక్కమీద ఒరిగిపోయింది.

"నేను చెబుతూనే ఉన్నానా... ఒంటి మీదకి తెచ్చుకుంటుందనీ" కాలిపోతున్న సంధ్య నుదుటి మీద తడిగుడ్డ వేసి తుడుస్తూ గొణిగింది శాంతమ్మ.

★ ★ ★

"సంజా" నెర్రెలిచ్చిన బీడుమీద తొలి చినుకు రాలినట్టు, నరికిన మానులోంచి చిరుచిగురు తల ఎత్తినట్టు లేత గొంతులోంచి మెత్తని పిలుపు.

ఆశ్చర్యంగా తెరవలేక తెరవలేక కళ్ళు సగం తెరిచింది సంధ్య.

"నీకు ఆయొచ్చిందా?" మృదువుగా నుదురు మీద చేయుంచింది బిందు.

ఎదురుచూడని ఆ అదృష్టానికి కంటివెంట జలజలా నీళ్ళొచ్చినయ్ సంధ్యకి.

"నేను నీ దగ్గరే ఉంటే తగ్గిపోతుందని నాన్నమ్మ చెప్పింది... నిజమా?" అంది బిందు గుసగుసగా.

"అవును తల్లీ" సంధ్య గొంతులో సంభ్రమంతో కూడిన గాద్గదికం. కన్నీళ్ళు ఆగడంలేదు.

"నేను వెళ్ళనులే, ఏడవకు మరి" అంది పాప సంధ్య కళ్ళు తుడుస్తూ.

సంధ్యకి మాటలు రావట్లేదు. దగ్గరగా లాక్కుని అదుముకోబోయి "వద్దు తల్లీ, నాకు జ్వరం" అంది.

"ఊహూ... నేను నీ దగ్గరే బజ్జుంటా" అంది బిందు సంధ్య గుండెల మీద వాలిపోయి.

అప్పుడే పాల ప్యాకెట్లతో లోపలికొచ్చిన ఆదిత్య కళ్ళు నులుముకున్నాడు... 'ఇది కలా... నిజమా..?' అనుకుంటూ. ★

